# ఆటోగ్రాఫ్

అడపాతడపా పత్రికల్లో పేరు కనబడడంతో కథా రచయితగా రవంత గుర్తింపు లభించింది. అభిమానులు ఉత్తరాలు రాయడం మొదలుపెట్టారు. దీనికి తోడు అంతో ఇంతో హెూదా వెలగబెడుతున్న ప్రభుత్వోద్యోగినవడం వల్ల ఓ సాహితీ సంస్థవారు, వారు నిర్వహించే సమావేశానికి అధ్యక్షత వహించమని కోరారు. వాళ్ళంత ఆదరంగా ఆహ్వానిస్తూ వుంటే ఎలా కాదంటాను? అందుకే ఊ కొట్టాను. సభ నిర్విఘ్నంగా సాగిపోయింది. అభిమానులు కొందరు వేదిక మీదకొచ్చి ఆటోగ్రాఫ్ మీద సంతకం చేయమన్నారు. నేను సున్నితంగా వారి అభ్యర్థనను త్రోసిపుచ్చాను.

"వాళ్ళ అభ్యర్థనను మీరంత బ్లంట్‌గా రిఫ్యూజ్ చేయడం ఏం బాగోలేదండి. వాళ్ళెంత చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయారో చూడండి" అన్నాడు నా ప్రక్కన కూర్చున్న ఓ పెద్దమనిషి నేను చేసిన పనికి నొచ్చుకుంటూ.

నిజమే ఆయన అన్నది అక్షర సత్యం. అయినా నాకు వాళ్ళ ఆటోగ్రాఫ్ మీద సంతకం చేయాలనిపించలేదు. గతంలోని ఓ చేదు అనుభవమే అందుక్కారణం.

• • •

ఒక రోజు సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చి డ్రస్ మార్చుకున్నాను. మా శ్రీమతి కాఫీ కప్పు అందిస్తూ "డబ్బు అందిందా?" అని అడిగింది.

"ఏం డబ్బు?" అన్నాను నివ్వెరపోతూ.

"అదేనండి మీరు పంపమన్న రెండొందలు."

"రెండొందలేమిటి? నేను పంపించమనడమేమిటి?" మరింత ఆశ్చర్యపోతూ

అడిగాను.

"అదేమిటండి అలా మాట్లాడుతారు. మీరు వ్రాసిచ్చిన ఎడ్రస్సు చూపిస్తూ అర్జంటుగా రెండొందలు పంపించమన్నారని మీ అటెండరు వచ్చి అడిగాడు" అంటూ చీటీ పట్టుకొచ్చి చూపించింది మా శ్రీమతి.

అది చూసి గతుక్కుమన్నాను.

ఆమధ్య మినీ కథా పఠనంలో నేను కథ చదివినప్పుడు కొందరు యువకులు నా వద్ద కొచ్చి ఆటోగ్రాఫ్‌లో సంతకం చేసి అడ్రస్ ఇమ్మన్నారు. ఆ అవకాశం కోసమే నేను ఎన్నాళ్ళబట్టో ఎదురుచూస్తున్నాను. నా చిన్న తనంలో ఓ ప్రఖ్యాత నవలా రచయిత మా ఊరు వచ్చినప్పుడు ఆటోగ్రాఫ్ ఇమ్మని ఎందరో అభిమానులు అతడిని చుట్టుముట్టారు. ఆ దృశ్యం నా కంటబడినప్పుడు నాకనిపించింది. "నేనెప్పుడా స్థితికి ఎదుగుతానో అని. ఆశించిన సమయం ఆసన్నమవడంతో అంతులేని ఆనందంతో వాళ్ళు పట్టుకొచ్చిన ఆటోగ్రాఫ్‌లో సంతకం చేసి ఎడ్రస్సు రాసిచ్చాను.

అయితే వారిలో ఒకడిలా మా ఆవిణ్ణి మోసం చేసి డబ్బు గుంజుకెళతాడని కలలో కూడా వూహించలేదు.

జరిగింది నా భార్యకు వివరించి ఇంకెప్పుడూ అలా మోసపోవద్దని హెచ్చరించాను. అప్పటినుండి ఎవరు ఆటోగ్రాఫ్ పట్టుకొచ్చినా సంతకం చేయకూడదని గట్టి నిర్ణయం తీసుకున్నాను.

● *ఆంధ్రజ్యోతి వీక్లీ, 27-8-93* ●